క్లుప్తంగా

బిల్ కలెక్టర్‌కు షోకాజ్ నోటీసు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ కార్యాలయంలో పన్నులు వసూలు చేసే కౌంటర్ వద్ద ఉండే బిల్ కలెక్టర్‌కు కమిషనర్ అభిషేక్ అగస్త్య షోకాజ్ నోటీసు జారీ చేశారు. సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'పన్నుల వసూళ్లపై నిర్లక్ష్యం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ఈ నోటీసులు జారీ చేశారు. ఎర్లీబర్డ్ స్కీం ముగింపు సమయంలో పన్నులు వసూలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, లక్ష్యాలకు అనుగుణంగా పన్నులను వసూలు చేయాలని ఈ మేరకు సిబ్బందిని, అధికారులను కమిషనర్ ఆదేశించారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం రిక్కాబజార్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని డాక్టర్ వెలిగేటి విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ స్టేట్ ఎంసీ మెంబర్ సాదినేని జనార్దన్ రావు, కోశాధికారి ఏ.గోవర్ధనరావు, మూలగుండ్ల శ్రీహరి, కొత్త సత్యనారాయణరెడ్డి, జల్లా వెంకటేశ్వర్లు, తాతా రాఘవయ్య, గజేంద్రుల నాగేశ్వరరావు, ఉపేందర్ రెడ్డి, వేగినాటి లక్ష్మయ్య, అనాసి రాధాకృష్ణ, కృష్ణయ్య, మోహన్‌రావు, రచ్చ రామారావు, దాసు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తుమ్మల నివాళి..


నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు తండ్రి పిచ్చయ్య మృతిచెందగా మండలంలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో ఆయన చిత్రపటానికి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడికి..

కూసుమంచి: సీపీఐ నాయకుడు సంగబత్తుల వెంకటరెడ్డి ఆశయసాధనకు కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ జిల్లా సమితి సభ్యులు గుండె పొంగు మల్లేష్, మండల కార్యదర్శి భూక్యా నర్సింహా పిలుపునిచ్చారు. ఈ మేరకు వెంకటరెడ్డి వర్ధంతి సందర్భంగా మండలంలోని గైగోళ్లపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా లింగయ్య, సంగబత్తుల ఉపేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పాండురంగా చారి, శంకర్, గురవయ్య, శ్రీకాంత్, పిచ్చయ్య ఉన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఓదెలా 2
వినోద	జింఖానా, మ్యాడ్ స్క్వేర్
సాయిరాం	సారంగపాణి జాతకం
ఆదిత్య	అర్జున్ S\o వైజయంతి
శ్రీనివాస	సూర్యాపేట జంక్షన్, జాక్

- ఖమ్మంవ్యవసాయం

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	26	పాలకూర	4
పచ్చిమిర్చి	20		20
కాకర	46	చుక్కకూర	4
బీర	50		20
దొండ	24	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	86	గోంగూర	4
గోరుచిక్కుడు	36		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	36		30
క్యారెట్	36	పుదీన	1
బీట్‌రూట్	26		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

ఆధునికీకరణకు అవాంతరాలు

ముందుకు సాగని ఖానాపురం అలుగువాగు ప్రాజెక్ట్

- రూ.270 కోట్లతో వర్షపునీరు, మురుగునీరు సాగేలా డిజైన్
- భూసేకరణపై స్పష్టత లేక సందిగ్ధత
- 20 మీటర్లతో ప్రభుత్వంపై భారం
- 10 మీటర్ల వెడల్పుతో తగ్గనున్న భూసేకరణ


ఆధునికీకరణలో భాగంగా ఖమ్మం-వైరా బైపాస్‌రోడ్డు వద్ద కొనసాగుతున్న పనులు



ఖమ్మం అర్బన్: ఖమ్మం నగరంలో వర్షపు నీరు, మురుగు నీటి పారుదల వ్యవస్థను ఆధునీకరించేందుకు సుమారు రూ.270 కోట్లతో చేపట్టిన ఖానాపురం అలుగు వాగు ప్రాజెక్టు పనులకు పలు అవాంతరాలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఇచ్చిన డిజైన్ ప్రకారం ప్రాజెక్టు పనులు సాగాలంటే భూసేకరణ సమస్యలు ఎదురవుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 20 మీటర్ల వెడల్పుతో పనులు కొనసాగిస్తే వాగు ఆక్రమణలతోపాటు, ప్రైవేట్ స్థలాలు, భవనాలు అడ్డు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు తేల్చారు. అలాగే ప్రభుత్వానికి భారంగా మారుతుందని చెబుతున్నారు. ఈ క్రమంలో 10 మీటర్ల వెడల్పుతో మరో డిజైన్‌ను అధికారులు తయారు చేస్తున్నారు.

20 మీటర్లతో డిజైన్..

మొదట 20 మీటర్లు వెడల్పుతో నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే పనులు ప్రారంభించిన అనంతరం దీనికోసం అవసరమయ్యే భూములు, తొలగించాల్సిన నిర్మాణాల పరిమాణం అధికారులను ఆందోళనకు గురి చేసింది. ఈ మేరకు ఇటీవల నాలుగు బృందాలుగా అధికారులు సర్వే చేపట్టి, 9 కిలోమీటర్ల మేర భూసేకరణ వివరాలను లెక్కగట్టారు.

రెండు అంచనాలతో ఉన్నత స్థాయిలో చర్చలు

ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నిర్మాణం, డిజైన్లపై ప్రభుత్వ ఉన్నత స్థాయిలో చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. ఈ రెండు నివేదికలు ఆధారంగా ప్రభుత్వంపై భారం పడకుండా, మురుగునీరు పోయే మార్గంకు అడ్డంకులు కలగకుండా అధికారుల స్థాయిలో ప్రతిపాదిత డిజైన్లపై మంతనాలు జరుగుతున్నట్లు సమాచారం. వ్యయ భారం తగ్గిస్తూ, లక్ష్యాన్ని కూడా సాధించేలా మార్గాలు అన్వేషిస్తున్నారు. ప్రజలకు నష్టం తక్కువగా ఉండేలా, ప్రభుత్వం మోయాల్సిన భారం తగ్గించేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇదిలా ఉండగా పనులు ఆలస్యం అవుతుండటంతో వర్షాకాలంలో ఇబ్బందులు తప్పేలా లేవు. దీంతో పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

డిజైన్లతో తేడాలు ఎలా..?

20 మీటర్ల వెడల్పుతో తలకు మించిన భారమవుతుందని దానికి ప్రత్యామ్నాయంగా వెడల్పు తగ్గించి లోతు పెంచే విధంగా 10 మీటర్ల వెడల్పుతో మోడల్ డిజైన్‌ను పరిశీలిస్తున్నారని తెలిసింది. ఈ డిజైన్ ప్రకారం, తక్కువ భూసేకరణతో పనిసాగించి, నిర్మాణాలను పెద్దగా తొలగించాల్సిన అవసరం లేకుండా ఉండే అవకాశం ఉంది. అయితే ఈ డిజైన్‌తో నదీ ప్రవాహాన్ని కాల్వలు తట్టుకోడానికి కొంత పరిమితి ఉంటుందని ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి. వెనుకవైపు 20 మీటర్ల వెడల్పుతో నిర్మాణం జరిగితే, ఎక్కువ స్థలాలు ప్రభుత్వ సేకరణలోకి రావాల్సి ఉంటుంది. వాగు ఆక్రమణలు తొలిగించినా కొన్ని ప్రాంతాల్లో వాగు అంత వెడల్పు లేకపోవడంతో ప్రజల నివాసాలు, కమర్షియల్ భవనాలు అనేకం తొలగించాల్సి రావడం వల్ల భారీగా పరిహార చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ఖర్చు కోట్లకు పెరిగే అవకాశం ఉందని అంచనా.

నాయకుల కనుసన్నల్లో లబ్ధిదారుల ఎంపిక


మాట్లాడుతున్న శ్రీనుయాదవ్

కామేపల్లి: ప్రభుత్వ పథకాల అమలుకు ఆయా గ్రామాల్లోని కాంగ్రెస్ నాయకుల కనుసన్నల్లో కొనసాగుతున్నాయని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు జాలె శ్రీనుయాదవ్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మద్దులపల్లిలో ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు అందాల్సిన పథకాలన్ని ఇందిరమ్మ కమిటీ సభ్యులు అనర్హుల పేర్లు సూచించి పేదలకు అన్యాయం చేస్తున్నారని, రాజకీయాలకతీతంగా పేదలకు పారదర్శకంగా అందించాల్సిన ఇందిరమ్మ ఇళ్లు అనర్హులకు అందేలా అధికార పార్టీ నాయకల అధిపత్యం కొనసాగుతుందని విమర్శించారు. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందించకుండా అర్హులైన పేదలకు అందేలా చూడాలన్నారు. ఇప్పటికైనా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేక దృష్టి సారించి పేదలకు అందేలా చూడాలన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఖమ్మం రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఖమ్మం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పథకాలను అర్హులకు కాకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు అందించేందుకు ప్రజాప్రతినిధులు కంకణం కట్టుకున్నారని, అర్హులందరికీ డ్రా ద్వారా మాత్రమే ఎంపిక చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి ఝాన్సీ, లక్ష్మణ్, కొల్లేటి నాగేశ్వరరావు, మంగతాయి, శ్రీను, ఆజాద్, భరత్, వెంకటేష్, సందీప్, రాకేష్, దేవల పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



ఖమ్మంవైద్యవిభాగం: అనాథ శవానికి అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల గుర్తు తెలియని, మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందగా మృతదేహన్ని ఖమ్మం ప్రభుతాస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతదేహం కోసం ఎవరూ రాకపోవటంతో పోలీసులు, వైద్యశాల సిబ్బంది సమాచారం ఇవ్వటంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. అన్నం శ్రీనివాసరావు, ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణం చేపట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కూసుమంచి: మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ కరుణ శ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు గుండా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గ కేంద్రంలో బస్టాండ్ లేకపోవటంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, మంత్రి పొంగులేటి బస్టాండ్ నిర్మాణానికి ఎన్నికల ప్పుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. నాయకులు వద్దెంపూడి నరేష్, బద్దం వెంకటరెడ్డి, పిట్టల వేణు, బాబా పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు


శంకరయ్యను సన్మానిస్తున్న గోపాలమిత్రలు

నేలకొండపల్లి: గోపాలమిత్ర సూపర్‌వైజర్ శంకరయ్య రైతులకు అనేక సేవలందించారని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొర్లకుంట్ల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో సూపర్‌వైజర్ శంకరయ్య పదవీవిరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఘనంగా సన్మానించారు. పశు వైద్యాధికారులు సంజయ్‌రెడ్డి, అశోక్, గోపాలమిత్రలు బీ.నారాయణ, ఆంజనేయులు, తాజ్‌పాషా, మస్తాన్, రాము, సైదయ్య, అరుణ, వెంకటేశ్వర్లు, ప్రసాద్, నాగేశ్వరరావు, వెంకట్రాది, నరేష్, పాండురంగయ్య పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల భవనాల మరమ్మతులకు నిధులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాల మరమ్మతులకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి రూ. 32,33,000 నిధులు విడుదలైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత డీఎంహెచ్ఓ భవనం బాయ్స్ హాస్టల్‌కు కేటాయించటంతో అక్కడ ప్రస్తుత మొదటి, రెండో ఏడాది విద్యార్థులకు వసతి ఏర్పాటు చేశామని, రాబోయే మూడో ఏడాది విద్యార్థుల వసతికి నాలుగో ఫ్లోర్‌లో ఈ నిధులతో ఆధునికీకరణ పనులు చేపట్టనున్నామని, కళాశాల చుట్టూ గోడ ఎత్తును పెంచుతున్నట్లు తెలిపారు. మూడో సంవత్సర విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వసతి ఏర్పాట్లు ఉంటాయని పేర్కొన్నారు.

నియామకం


భాస్కర్

ఖమ్మం మామిళ్లగూడెం: మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా ఖమ్మంకు చెందిన కొరివి భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధికార ప్రతినిధి ముడుసు జాకబ్ ప్రతాప్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ... తనకు అవకాశం కల్పించిన జాకబ్ ప్రతాప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కామేపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించి సద్వినియోగం చేసుకోవాల్సిన మండల వ్యవసాయాధికారి భూక్యా తారాదేవి అన్నారు. ఈ మేరకు సోమవారం కామేపల్లిలో పీఏసీఎస్‌లో ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలు పాటించి మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలని, దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

నూతన ఆవిష్కరణలు చేయాలి


సర్టిఫికెట్లతో విద్యార్థినులు

ఖమ్మంసహకారనగర్: విద్యార్థినులు వారిలో ఉన్న సృజనాత్మక ఆలోచనలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి నూతన ఆవిష్కరణలు చేయాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.పద్మావతి అన్నారు. యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్, యూనిసెఫ్, కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ (సీసీఈ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్నోవేటివ్ అండ్ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌మెంట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థినులకు ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎజె.రామారావు, జేక్యూఏసీ కో ఆర్డినేటర్ ప్రవీణ్, కళాశాల వైఎఫ్ఎస్‌జే కన్వీనర్ డాక్టర్ చేకూరి రమేష్, చాట్ల రాజేష్‌కుమార్, సూర్యలక్ష్మి, సునంద తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వేసేలా..


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వేసే సంస్థలుగా పనిచేస్తున్నాయని కలెక్టర్ ముజమ్మిల ఖాన్ అన్నారు. తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రచార పోస్టర్లను సోమవారం అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పోస్టర్లు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో, ముఖ్య ప్రాంతాల్లో ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ అభిషేక అగస్త్య, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్, ప్రాంతీయ సమన్వయ అధికారి వెంకటరామయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిశీలించి పరిష్కరించండి


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వాటిని వెంటనే పరిష్కరించాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. సోమవారం కేఎంసీ గ్రీవెన్స్‌లో ప్రజల నుండి ఫిర్యాదులు అందుకొని వాటిని పరిశీలించి పరిష్కారించాలని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయొద్దని, ఫిర్యాదుదారులు పదేపదే కేఎంసీకి తిరిగేలా వ్యవహరించవద్దని సూచించారు.

రెండు రోజులే గడువు..

పన్నుల చెల్లింపునకు ఎర్లీ బర్డ్ స్కీం బుధవారంతో ముగుస్తుందని కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ఇప్పటి వరకు ఈ స్కీం ద్వారా 12,664 మంది పన్నులు చెల్లించగా వారందరికీ 5 శాతం రాయితీ వర్తించిందన్నారు. ఇప్పటి వరకు రూ.7.61 కోట్లు పన్నులు వసూలయ్యాయన్నారు. రెండు రోజులు మాత్రమే పథకానికి గడువు ఉండడంతో నగర వాసులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిపై స్థానిక రైల్వేస్టేషన్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ఇప్పటికే సుమారు 50 శాతం వరకు పనులు పూర్తయ్యాయన్నారు. పరిశీలన అనంతరం నిర్వహించిన సమీక్షలో రైల్వే అధికారులు స్టేషన్‌లో జరుగుతున్న ఇతర పనుల విషయాన్ని వివరించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, కొత్త జనరల్ వెయిటింగ్ హాల్, రిటైరింగ్ గదులు, గోడల నిర్మాణాలు, ప్లాట్‌ఫారంపై అదనపు కప్పు ఏర్పాట్లు, సీటీసీ నిర్మాణాలు వంటి పనులు ప్రాధాన్యత పొందుతున్నాయన్నారు. డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, దొంగల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మూర్తి వీరభద్రప్రసాద్, నాగేశ్వరరావు, అల్లిక అంజయ్య, రవీందర్, రవిరాథోడ్, రేఖా సత్యనారాయణ, నెల్లూరు బెనర్జీ, నరేష్, పాపారావు, సరస్వతి, వెంకట్, మాధవ్, మణి, రాజేష్, సాయిరాం, మధు, దాసు, రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం ప్రారంభం


గాజుపెంకులపై నడుస్తున్న విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని నిర్మల్ హృదయ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక, తెలంగాణ సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రముఖ వైద్యులు కె.మహేంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలవాల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్వీ రెడ్డి, టి.శివన్నారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణశ్రీ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.మోహన్, రామారావు ఆర్.శ్రీరాములు, ఎస్.ఏసోబు, రామకృష్ణ, అకడమిక్ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వర్లు, డాన్‌బాస్కో, రాఘవయ్య, విజయలక్ష్మి, వీరనారాయణ, నాగేశ్వరరావు, విప్లవ కుమార్, వసుంధర, మల్లికా, రవి, ఎస్వీఆర్ పురుషోత్తమరావు, నాగేంద్రం, అప్పారావు, మోహన్ ఉన్నారు.

టీపీఎస్ నరేష్‌కు పదోన్నతి

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ (టీపీఎస్) సీహెచ్.నరేష్‌కుమార్‌కు టీపీవోగా పదోన్నతి కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఎస్.దేవేందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నరేష్‌కుమార్‌ను పెద్దపల్లి మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ (టీపీవో)గా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సోమవారం నరేష్‌కుమార్ కేఎంసీ టీపీఎస్ విధుల నుండి రిలీవ్ అయ్యారు.

ఆక్రమణలు తొలగించాలని నోటీసులు

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం రెవెన్యూ పరిధిలో సాగర్ ఇన్‌ఫ్లో కాల్వకు ఇరువైపులా స్థలాలను కొందరు ఆక్రమించుకోగా ఆ ఆక్రమణలను తొలగించాలని నీటి పారుదల శాఖ అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఆక్రమించుకున్న భూమిలో ఎలాంటి నిర్మాణాలు ఉన్నా స్వయంగా ఆక్రమణదారులే తొలగించుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల గ్రామంలో లేళ్ల నారాయణకు మంజూరైన రూ. 60 వేల సీఎంఆర్ఎఫ్ మంజూరీ పత్రాలను సోమవారం కాంగ్రెస్ అడహక్ కమిటీ మండల కన్వీనర్ వాంకుడోత్ దీపక్ నాయక్ బాధితుడికి అందజేశారు. నాయకులు బండి నాగేశ్వరరావు, అరవికట్ల సుధీర్, రామారావు, ప్రేమ్ కుమార్, నర్సయ్య, బాబు, రమనాథం, డీలర్ రాంబాబు పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి కాపాడండి

నేలకొండపల్లి: మండలంలోని ఆచార్లగూడెం పరిధిలో ఉన్న రైస్‌మిల్లు వల్ల కాలుష్యంతో తీవ్రంగా నష్టపోతున్నామని, వారిని కాపాడాలని గువ్వల గూడెంకు చెందిన యం.వెంకటేశ్వర్లు అడిషనల్ కలెక్టర్ పి.శ్రీజకు సోమవారం ఫిర్యాదు అందించారు. మిల్లు నుంచి వచ్చే కాలుష్యంతో పంటలు, ఆరోగ్యం దెబ్బతింటున్నాయన్నారు. స్పందించిన శ్రీజ చర్యలు తీసుకోవాలని పోల్యూషన కంట్రోల్ బోర్డు అధికారులను ఆదేశించినట్టు తెలిపారు.

ఇక విచారణే తరువాయి..

- నేటి నుంచి ఇందిరమ్మ కమిటీలిచ్చిన జాబితాపై క్షేత్రస్థాయి విచారణ
- ప్రతీ 200 ఇళ్లకు ఒక గెజిటెడ్ అధికారి నియామకం


వివరాలను వెల్లడిస్తున్న ఎంపీడీవో యర్రయ్య

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం చివరి విచారణ మొదలైంది. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన జాబితా వివరాలతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన (చెక్‌లిస్ట్)ను మంగళవారం నుంచి మొదలుపెట్టనున్నారు. జాబితాలో పేరున్న ప్రతీ ఇంటి తలుపు తడుతూ పూర్తి వివరాలను ఆరా తీయనున్నారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న వారి ఇంటిపై కప్పు, గోడలు, గదులు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారా, స్థానిక నివాసేనా తదితర వివరాలు జాగ్రత్తగా పరిశీలించనున్నారు. ఇదిలా ఉండగా ఏప్రిల్ నెలాఖారులోపు విచారణ పూర్తి చేయాలి. మే 2 నుంచి పంచాయతీ కార్యాలయాలలో జాబితాను ప్రదర్శిస్తారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో మే 3 నుంచి 5 వరకు జిల్లా కలెక్టర్ లబ్ధిదారుల పేర్లతో ప్రొసీడింగ్స్ జారీ చేస్తారు.

ప్రతీ 200 ఇళ్లకు ఒక గెజిటెడ్ అధికారి..

జాబితాపై క్షేత్ర స్థాయిలో విచారణ కోసం గెజిటెడ్ స్థాయి అధికారిని నియమించి ఒక్కో అధికారికి 200 ఇళ్లను కేటాయించారు. మండలంలోని కొంగర గ్రామం ను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయటంతో మిగతా 31 పంచాయతీలలో 704 ఇళ్లను మంజూరు చేశారు. మండలానికి ఇరిగేషన్ డీఈఈ మన్మథరావు, ఏఈలు నరేష్, హృతిక్‌రెడ్డి, మదీనా, ఆర్అండ్‌బీ ఏఈ పృథ్వీ, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివలను నియమించారు.

లబ్ధిదారులు సహకరించాలి..

ఇదిలా ఉండగా లబ్ధిదారులు పూర్తి వివరాల కోసం విచారణ చేసే అధికారులు వారి ఇంటి పక్కన ఉన్న వారిని కూడ ఆరా తీస్తారని, లబ్ధిదారులు పూర్తి వివరాలు అందించి సహకరించాలని ఎంపీడీఓ యం.యర్రయ్య సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో కోరారు. మంగళవారం నుంచి విచారణ ప్రారంభించి మే 1 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు ఉన్నారు.

వీరు అనర్హులు..

- స్థలం ఉన్నా.. ఆర్‌సీసీతో ఇంటి నిర్మాణం ఉంటే..
- 2.5 ఎకరాల తడి, ఐదెకరాల మెట్ట భూమి ఉన్న వారు.
- నాలుగు చక్రాల వాహనాలు ఉన్న వారు.
- కిసాన్ క్రెడిట్ కార్డు ఉండి రూ.50 వేలపై పరిమితి మించిన వారు
- కుటుంబ సభ్యులలో ఎవరైనా ఆదాయ పన్ను, ప్రొఫెషన్ ట్యాక్స్ చెల్లింపుదారులు అనర్హులు..
- తల్లిదండ్రులు, పిల్లలు ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి ఉంటే
- వలస వచ్చిన కుటుంబాలైతే..